# జిందగీ చింతన



విజయ దశమి ప్రత్యేకం

## వడగండ్లు



**కొడుక్కి** యోగా నేర్పిద్దామని ఓ తండ్రి శిక్షకుడి దగ్గరికి తీసుకెళ్లాడు. 'వదులైన దుస్తులు వేసుకోవాలి, సూర్యోదయానికి పూర్వమే రావాల'ని చెప్పాడు శిక్షకుడు. మరుసటిరోజు నుంచీ తండ్రి తన కారులో కొడుకును తీసుకెళ్లడం ప్రారంభించాడు. కొడుకు యోగా చేస్తున్నంతసేపూ గది పక్కనే ఉన్న చెట్ల కింద కూర్చునేవాడు తండ్రి. మూడోరోజు ఉదయం వడగండ్ల వర్షం మొదలైంది. కొడుకు అసహనంగా తరగతి నుంచి బయటికి వచ్చాడు. అతని వాలకం చూసి ఏమైందని అడిగాడు తండ్రి. 'నేను ఎంత బాగా ఆసనాలు వేసినా శిక్షకుడు ఏదో ఒక తప్పు పడుతున్నాడు, సరిగా చేయలేదని కోప్పడుతున్నాడు' అన్నాడు. అబ్బాయిని సముదాయిస్తూ 'నువ్వు ఆసనాలు బాగా వేయాలని, ఆయన కఠినంగా మాట్లాడి ఉండవచ్చు. ఆయన మాటలను కాకుండా, అందులోని భావం అర్థం చేసుకో. ఆయన చెప్పినట్టు వింటే నీకే కదా ప్రయోజనం' అన్నాడు తండ్రి. కొడుకు కాసేపు మౌనంగా నిలబడ్డాడు. 'అక్కడ పడుతున్న వడగండ్లను గమనించు' అన్నాడు తండ్రి. 'ఏముంది వడగండ్లు కాసేపటికి నీరుగా మారుతున్నాయి' అన్నాడు. తండ్రి చిన్నగా నవ్వి 'వడగండ్లు చూడటానికి కఠినంగా కనిపించినా కాసేపటికే నీరుగా మారిపోతున్నాయి కదా! మన మంచికోరే వారి కోపం వడగండ్ల లాంటిదే. వారు కఠినంగా మాట్లాడినప్పుడు మనకు బాధ కలిగినా, వాటివల్ల మనకు మంచే జరుగుతుంది' అని హితవు చెప్పాడు. మర్నాడు కొడుకు ఉత్సాహంగా యోగా శిక్షణకు హాజరయ్యాడు.

... ఆర్.సి.కృష్ణస్వామి రాజు

# శ్రీరామ విజయోత్సవం



**విజయ దశమి రోజున పదితలల రావణుడి దిష్టిబొమ్మను దహనం చేస్తాం. కారణం.. త్రేతా యుగంలో ఇదే రోజున అసుర సంహారం జరిగింది. సత్యం నిత్యమై నిలిచింది. ఇంతలోనే ద్వాపర వచ్చింది. సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఈ సారి శ్రీకృష్ణుడు కురుక్షేత్ర సంగ్రామం ద్వారా.. దుర్మార్గాన్ని నాశనం చేశాడు. ధర్మాన్ని గెలిపించాడు. కలియుగం వచ్చింది... ధర్మం ఒంటి పాదంపై నిలబడే పరిస్థితి దాపురించింది. ప్రతి ఇల్లూ లంకలా మారింది. ప్రతి బుర్రలో దశకంఠుడు తిష్ఠ వేశాడు. త్రేతాయుగంలో రావణుడు చేసిన పొరపాటును మనమూ చేయకుండా.. మనలోని అసుర ప్రవృత్తిని దసరానాడు దహించి వేయాలని చెబుతారు శ్రీల ప్రభుపాదులవారు.**

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః
కామః క్రోధస్తథా లోభస్తస్మాదేతత్త్రయం త్యజేత్

**'ఓ అర్జునా!** కామం, క్రోధం, లోభం అనేవి మూడు నరకద్వారాలు. అవి ఆత్మ నాశకరములు. వివేకులు వాటిని తక్షణం త్యజించాలి' అని బోధించాడు పరమాత్ముడు. ఈ శ్లోకంలో శ్రీకృష్ణుడు అసురప్రవృత్తికి కారణాన్ని, దాంతోపాటే పరిష్కారాన్నీ సూచించాడు. నిజానికి కామ, క్రోధాదుల్ని మనం పట్టుకొని ఉంటే కదా.. వదిలేయడానికి. అవే మనల్ని పట్టుకొన్నాయి. బానిసలుగా చేసి ఆడిస్తున్నాయి.

**దురాశ దుఃఖానికి చేటు**

దశకంఠుడు.. మరణాన్ని జయించాలని తపించాడు. ఆ మేరకు బ్రహ్మ నుంచి వరం పొందాలనుకున్నాడు. తాను మృత్యువును శాసించలేనంటూ బ్రహ్మ తప్పించుకున్నాడు. పరిమితులతో కూడిన వరాన్ని ఇచ్చాడు. అయినా తనకు తిరుగేలేదని విర్రవీగాడు అల్ప సంతోషి అయిన రావణుడు. 'జాతస్య హి ధ్రువో మృత్యుః' అంటాడు గీతాచార్యుడు. పుట్టిన వారికి మరణం తప్పదు, మరణించినవానికి పుట్టుక తప్పదు. మనమంటే.. బాహ్యంగా కనిపిస్తున్న అశాశ్వతమైన ఈ దేహం కాదనీ, మనం శాశ్వతమైన ఆత్మ స్వరూపులమని గుర్తించాలి. మరణమనేది ఈ దేహానికే కాని, మనకు కానేకాదని తెలుసుకోవాలి. ఈ మహత్తరవరాన్ని భగవంతుడు ఇదివరకే మనకు ప్రసాదించేశాడు. మనం ఆరాటపడాల్సిందల్లా ధర్మనిర్వహణ గురించి మాత్రమే. రావణుడిలా దేహ శాశ్వతత్వం కోసం కాదు.

**అసుర గుణం..**

ఒకానొకసారి వాలి రావణుడిని తోకతో చుట్టి సప్తసముద్రాల రుచి చూపించాడు. మరొకసారి దశకంఠుడు కార్తవీర్యార్జునుడితో యుద్ధానికి సిద్ధపడి.. భంగపడ్డాడు. ఇలా పలుమార్లు గర్వభంగం కలిగినా అతను మారలేదు. ప్రవృత్తిని మార్చుకోలేదు. ఇది అసుర లక్షణం. ఈ ఘట్టం వాల్మీకి రామాయణంలో లేదు కానీ, పరమశివుడు పార్వతీదేవికి బోధించినట్టుగా చెప్పే 'శివ రామాయణం'లో ప్రస్తావితమైంది. సీతా స్వయంవరంలో రావణుడు శివ ధనుస్సును ఒంటిచేత్తో ఎత్తేందుకు ప్రయత్నించాడు. అతికష్టం మీదపైకెత్తినా.. వింటినారిని అందుకునే ప్రయత్నంలో ధనుస్సు పట్టుతప్పింది. పది తలలనుంచి రక్తం ప్రవహించింది. రామచంద్రుడు మాత్రం అవలీలగా శివ ధనుస్సు ఎక్కుపెట్టాడు. అప్పుడే కనుక, రావణ బ్రహ్మ మేల్కొని ఉంటే.. సీతమ్మ తల్లిని మోహించేవాడే కాదు. పరిస్థితి యుద్ధం వరకూ వచ్చేదే కాదు. చివరికి భార్య మండోదరి హితవును చెవికెక్కించుకున్నా సరిపోయేది. రణ క్షేత్రంలోనూ అతనికి చివరి అవకాశం వచ్చింది. తనవారంతా నేలకొరిగిన తర్వాత.. రావణుడు తానే స్వయంగా రామునిపై యుద్ధానికి దిగాడు. రామ బాణాలకు తాళలేక.. నిర్వీర్యుడై నిలుచుండిపోయాడు. ఆ పరిస్థితిలో శ్రీరాముడు మరుసటి రోజు యుద్ధాన్ని కొనసాగిస్తానని చెప్పి.. రావణుడికి మరో అవకాశాన్ని ప్రసాదించాడే కానీ వధించలేదు. అప్పుడైనా ఆ అసురపతి వాస్తవాన్ని గ్రహించాల్సింది. శరణు వేడాల్సింది. మూర్ఖంగా మరుసటి రోజు బరిలో నిలిచి శ్రీరామచంద్ర ప్రభు చేతిలో హతుడయ్యాడు.



**'ఈ భౌతిక జగత్తులో రావణుడిని తలపించే మహా బలసంపన్నులు, ఐశ్వర్యవంతులు చాలా మందే ఉన్నారు. వారెవరి స్థానాలూ సురక్షితం కాదు. ఎందుకంటే వాళ్లు కూడా కర్మబద్ధులే (కర్మణా దైవనేత్రేణ). ప్రకృతి నియమాలకు మనం పూర్తిగా అధీనులమనే విషయాన్ని ఎన్నడూ మరువరాదు. రావణుడు చేసిన పొరపాటు అదే' అంటారు శ్రీల ప్రభుపాదులు. పరమాత్మ తత్వాన్ని గ్రహించి, అహాన్ని జయించి, అరిషడ్వర్గాలను అధిగమించి.. బతకాలి మనం. అదే రామాయణ సారాంశం, గీతా సారం. దసరా.. సందేశం.**

... సత్య గౌర చంద్రదాస


## మహిషుడి ఊరే నేటి మైసూరు



**దుర్గాదేవి** మహిషాసురుణ్ని వధించిన ఘట్టానికి గుర్తుగా దసరా జరుపుకొంటున్నారు. అయితే కర్ణాటకలోని కొన్ని తెగల్లో మహిషాసురుడు అంటే గౌరవభావం ఉంది. మైసూరు దగ్గర్లో చాముండి హిల్స్ ఉంటుంది. ఆ కొండ మీద ఒకచేతిలో కత్తి, మరోచేతిలో నాగుపాము పట్టుకుని నిల్చున్న మహిషాసురుడి భారీ విగ్రహం ఉంటుంది. అసలు మైసూరు అనే పదం మహిషూరు... లేదా మహిషాసురుని ఊరు అనే పదం నుంచి వచ్చిందని అంటారు. దేవీ పురాణంలో కూడా మైసూరు ప్రాంతం మహిషాసురుడి రాజ్యంగా పేర్కొన్నారు. దేవతలను, దేవుళ్లను రక్షించడానికి దుర్గాదేవి చాముండేశ్వరిగా అవతరించి దుష్టుడైన మహిషాసురుణ్ని సంహరించిందని కథ. కానీ, స్థానికులు మాత్రం మహిషుణ్ని మంచి పాలకుడిగా విశ్వసిస్తారు.

రేపు మధ్వ జయంతి

## విష్ణువొక్కడే విశ్వాంతరాత్ముడు!



**అనేక మతాలు.** అనేకానేక భాష్యాలు. నాస్తిక వాదాలు. ఏది సత్యమో, ఏది అసత్యమో అర్థంకానంత అయోమయం. పరమాత్మ తత్వాన్ని ఆకళింపు చేసుకునే ప్రయత్నంలో సామాన్య సాధకులకు అనేక అవరోధాలు. అప్పుడే, మలయమారుతంలా ధార్మిక జగత్తులో అవతరించారు మధ్వాచార్యులు. క్రీ.శ 1238లో కర్ణాటక రాష్ట్రం ఉడుపి సమీపంలోని పాజక క్షేత్రంలో జన్మించారు ఆచార్యులు. పూర్వాశ్రమ నామం వాసుదేవుడు. పదకొండేండ్ల వయసులో.. తన గురువు అచ్యుత ప్రజ్ఞుల చేతుల మీదుగా సన్యాసం స్వీకరించి.. పూర్ణ ప్రజ్ఞులు అయ్యారు. ద్వైతమే పరమధర్మమని నిరూపించారు. ఉపనిషత్తులకు, బ్రహ్మ సూత్రాలకు, భగవద్గీతకు టిప్పణి రాశారు. గీతాభాష్యం, గీతా తాత్పర్యం, న్యాయ వివరణ తదితర రచనలు సుప్రసిద్ధాలు. ఉడుపిలోని సుప్రసిద్ధ కృష్ణాలయాన్ని వెలుగులోకి తెచ్చారు. అక్కడే అష్టమఠాలను స్థాపించి.. ద్వైత ధర్మ పరివ్రాజకులను నియమించారు. జగత్తు సత్యం. జీవుడు బ్రహ్మ ఒకటి కాదు. ఇవి రెండూ వేరువేరు తత్వాలు. పరమాత్మ సగుణసాకారుడు. మోక్షానికి విష్ణుభక్తే ఏకైక మార్గం.. అని బోధించారు. శంకరుల అద్వైతాన్ని ఖండించారు. భగవన్నామ స్మరణను ప్రోత్సహించారు. త్రేతాయుగంలో హనుమంతుడు, ద్వాపరలో భీముడు, కలియుగంలో మధ్వాచార్యులు.. వాయుదేవుడి అంశగా జన్మించారని మధ్వ సంప్రదాయాన్ని అనుసరించేవారి విశ్వాసం.

*సోమ (చంద్ర) సూర్య వంశాలలో స్వనామ ధన్యులైన- ప్రసిద్ధులైన మహారాజవర్యుల ప్రాభవ- పరిపాలనా వైభవ గరిమను, పరమ భాగవతుల మహిమను విశదపరచే నవమ స్కంధానికి నమోవాకాలర్పిస్తూ, ఇక భాగవత కల్పతరువుకి మూల స్కంధము, కృష్ణమూలమూ అయిన అసమాన దశమ స్కంధపు సుషమా- శోభా సుగంధాలను ఆఘ్రాణిద్దాం. శ్రీమద్భాగవతం శ్రీ కృష్ణ భగవానుని దివ్య మంగళ వాఙ్మయ విగ్రహం. అందు దశమ స్కంధం గోవిందుని చక్కగా వికసించి విప్పారిన ముఖారవిందం. పరిపూర్ణావతారంగా ప్రశస్తి కన్న శ్రీ కృష్ణ పరమాత్మ దివ్యనామ, రూప, గుణ, లీలా, ధామాల సుధార్ణవం- అమృతసాగరం. భగవత్ భాగవతుల భవ్య కథా కదంబం. బమ్మెర పోతన కావ్యశిల్పి ఇమ్ముగ చెక్కిన భాగవత శిల్పారామంలో దశమస్కంధం, మన భాగ్యం కొద్దీ దక్కిన, భక్తిరసాన్ని కుమ్మరించే చక్కని కళాఖండం. మూల భాగవతంలో మూడు ముప్పదుల (తొంబది) అధ్యాయాలలో శ్రీకృష్ణుని లీలలు 'గోకుల బృందావన, మధుర, ద్వారక'- ఇలా మూడు విధాలా చాలా కూలంకషంగా వర్ణింపబడినాయి.*



మన పోతన మధురిమ 153వ భాగం

# శ్రీకృష్ణలీలా సంద్రం.. దశమ స్కంధం!



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

**ద**శమ స్కంధ అనువాదానికి శ్రీకారం చుట్టుతూ పోతన పరిపాటి- పద్ధతిని పాటిస్తూ, స్కంధ ప్రారంభంలో తన ఆరాధ్య దైవం అరవింద నేత్రుని రామచంద్రునికి మాకందం లాంటి ఈ కంద పద్యంలో అందంగా ఇలా వందన మాచరించాడు..

**కం|| 'శ్రీకంఠ చాప ఖండన!
పాకారి ప్రముఖ వినుత భండన! విలసత్
కాకుత్స్థ వంశ మండన!
రాకేందు యశోవిశాల! రామనృపాలా!'**

శివుని విల్లు విరిచి సీతాదేవిని చేపట్టిన జగజెట్టీ! ఇంద్రాది అమరులచే స్తుతింపబడిన సమర విద్యా వైభవాలు అమరినవాడా! విశదమైన ఖ్యాతితో విరాజిల్లు కాకుత్స్థ వంశానికి విభూషణమైనవాడా! విశ్వమంతా వ్యాపించిన కార్తీక పున్నమి వెన్నెల వంటి కీర్తి ప్రతిష్ఠలు కలవాడా! ప్రజలను ఉద్ధతుడై- గర్వితుడై శాసించక, ఉదాత్తుడై- దయాళువై ఉపాసించిన- రంజిల్ల చేసిన రాజచంద్రమా! రఘురామా! నీకు నీరాజనాలు!

సూతముని శౌనకాదులతో- మహర్షులారా! పరీక్షిన్మహారాజు శుకయోగితో ఇలా విన్నవించాడు- యోగీంద్రా! నీవు చంద్ర, సూర్యుల వంశాల విస్తారాన్ని, వానిలో జన్మించిన రాజచంద్రుల పరమాద్భుత చరిత్రలను చెప్పగా విన్నాం.

**కం|| 'శీలము గల యదు కులమున
నేలా పుట్టెను మహాత్ముఁడీశుఁడు విష్ణుం
డే లీల మెలఁగె? నెయ్యే
వేళల నే మేమి సేసె? వివరింపు తగన్'**

'జగదీశ్వరుడు, మహాత్ముడు, పన్నగశాయి విష్ణువు శీలవంతమైన యదుకులంలో లీలా మానుష విగ్రహుడై ఏల జన్మించాడు? అలా పుట్టి ఆ వసుదేవ పట్టి (పుత్రుడు) ఎలా ప్రవర్తించాడు? ఏ ఏ వేళల్లో ఎట్టి ఘనకార్యాలు సాధించాడు? ఈ విషయాలన్నీ నాకు కళ్లకు కట్టినట్టుగా ఇంపుగా వినసొంపుగా వివరింపు'. గతంలో సంగ్రహంగా చెప్పావు. తృప్తి కలగలేదు. ఇప్పుడు విపులంగా చెప్పు స్వామీ! అని అర్థించాడు పృథ్వీపతి.

**కం|| 'భవములకు మందు చిత్త
శ్రవణానందము ముముక్షుజన పదము, హరి
స్తవము పశుఘ్నుఁడు దక్కను,
జెవులకుఁ దని వయ్యెననెడి చెనఁటియు గలఁడే?'**

'గురువరా! కరివరదుడైన శ్రీహరి కీర్తనం భీకర సంసార రోగాన్ని హరించే సరి అయిన మందు. అది వీనులకు విందు. మనసుకు పసందైన పరమానందపు పొందు. ముముక్షువులకు ముక్తి నిధానం- కోరదగిన స్థానం. అలాంటి విష్ణు స్తవం విని 'ఇక చాలు, మాకు తనివి తీరింది' అని పలికే వెర్రివాడు ఉంటాడా? కసాయివాడు, కిరాతకుడు తప్ప మరొకడు అలా అంటాడా? శుక మునీ! దేవతలకు కూడా దాటరాని కౌరవసేనా సాగరాన్ని మా పెద్దలు పాండవులు 'బాలపదము'గా- ఒక పిల్లవాని అడుగును వలె కడు సులభంగా దాట గలిగారు. ఏ నావ సాయంతో? మా తాతలకు మేనబావ అయిన వాసుదేవ భగవానుడే ఆ నావ! పాండవ వంశాంకురంగా నా తల్లి గర్భంలో ఉన్న నన్ను అశ్వత్థామ బాణాగ్నికి గురి కాకుండా ఆమె (ఉత్తర) కావమని వేడగా ఆ దేవ దేవుడే నన్ను కాపాడాడు! హలధర (బలరామ) సోదరుడైన ఆ జలజాత నేత్రుడే నా ఇలవేల్పు. ఆ ఆదిదేవ పద సేవయే ముక్తికి త్రోవ! మహామునీ! అట్టి పురుషోత్తముని పవిత్ర చరిత్రని నాకు సమగ్రంగా వినిపించు' అని మరలా ఇలాగని అన్నాడు...

**ఆ|| 'నీ ముఖాంబుజాత నిర్ముక్త హరికథా,
మృతముఁ ద్రావఁ ద్రావ మేను వొదలె,
వంత మానె, నీరువట్టు నాఁకలియును
దూరమయ్యె, మనము దొంగలించె'**

'మహర్షీ! నీ ముఖ పద్మం నుంచి జాలువారుతున్న హరికథ అనే సుధను తాగి తాగి నా తనువు పులకరిస్తోంది. నాకు అంత్యకాలం చెంతకు వస్తోందన్న వంత- దుఃఖం సొంతం అంతరించింది. ఆకలి దప్పుల చింత రవ్వంత కూడా లేకుండా పోయింది. నా మనస్సు పులకింతతో పరవళ్లు తొక్కుతోంది' అని విన్నవించుకొన్న రాజు మాటలు విని శుకముని ఇలా అన్నాడు...

**కం|| 'విష్ణు కథా రతుఁడగు నరు,
విష్ణుకథల్ చెప్పు నరుని, వినుచుండు నరున్
విష్ణు కథా సంప్రశ్నము
విష్ణు పదీ జలము భంగి విమలులఁ జేయున్'**

'రాజా! విష్ణు పాదాల నుండి ఉద్భవించిన గంగాజలం దర్శన, స్పర్శన, పానాలచే జనులను పావనం చేయునట్లు, విష్ణు కథా ప్రసంగం కూడా, దాని యందు ఆసక్తి కనబరచే వారిని, అనగా చెప్పమని అర్థించే వారిని, చెప్పే వారిని, శ్రద్ధగా వినేవారిని పునీతులను కావిస్తుంది'. మానవ నాథా! పూర్వం ఎందరో దానవులు పాలకులై నేలను ఆక్రమించారు. ఆ భారం మోయలేక భూదేవి గోరూపాన బ్రహ్మ వద్దకు వెళ్లి కన్నీరు మున్నీరుగా రోదించింది. భూదేవి, దేవతలు వెంట రాగా విధాత విష్ణువును దర్శించి, పురుష సూక్తంతో ప్రస్తుతించగా ఆయనకు సమాధి స్థితి కలిగింది. ఆ ధ్యానంలో విన్న విషయాన్ని విరించి వారికి ఇలా వివరించాడు.. అమరులైన మీరంతా మీ మీ అంశలతో యాదవ వంశంలో మేదిని- భూమిపై జన్మించండి. హరి సేవకై సురకన్యలు- దేవతా స్త్రీలు కూడా సుందర రూపాలతో వసుంధర- పుడమిపై పుడతారు. విష్ణువు వసుదేవుని గృహంలో పుత్రుడుగా అవతరించి, అవనీ భారం తొలగిస్తాడు. ఆదిశేషుడు అచ్యుతుని కళ- అంశతో ఆయన అన్నగారుగా అవనిపై ఆవిర్భవించగలడు. ఆర్యాదేవి-యోగమాయ కూడా స్వామి కార్యనిర్వహణకై అవతరిస్తుంది! ఇలా భూదేవిని ఓదార్చి, బ్రహ్మ తన లోకానికి వెళ్లిపోయాడు. వసుదేవుని గృహమనగా కంసుని కారాగృహమే. భేద (ద్వైత) బుద్ధి స్వరూపురాలైన దితి పుత్రులే ధరణికి భారం. మేను (దేహము) నే 'నేను'గా అభిమానించు హీన బుద్ధులే దైత్యులు- అశుభ వాసనలు. అంధకారం అంతరించాలంటే ఆలోకం- వెలుగు రావాలి. అజ్ఞానం తొలగాలంటే జ్ఞాన జ్యోతి వెలగాలి. అలాగే దేహాభిమానమనే దైత్యుడు నశించాలంటే దేవదేవుడు దేహమనే గోకులంలో, హృదయ బృందావనంలో అవతరించక తప్పదు. శుక ఉవాచ- ఆ కాలంలో శూరసేనుడు యాదవులకు శాసకుడు. మధురాపురం అతని రాజధాని. శ్రీహరి అవతరించగా ఈ మధురా నగరియే గిరిధరుని లీలా విభూతులకు ఆలవాలం- కేంద్రమైంది. జీవుల అంతఃకరణాన్ని- మనస్సును తన వైపు ఆకర్షించడమే అచ్యుతుని ఆనందమయ లీలల ప్రదర్శనకు ప్రధాన ప్రయోజనం. జీవునిలో లీనమై- అణగారి ఉన్న అవ్యక్త ఆనందాన్ని వ్యక్తపరచి- వెలికి తీసి అనుభవానికి తెప్పించడమే లీలా పరమార్థం- 'లీనం లాతి ఇతి లీలా!'

(సశేషం)